andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.7, కనిష్ఠం 24.1
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 13 ఏప్రిల్ 2024




'బాసరలో శివాలయానికి మెయిన్ బటన్ వల్లనే కరెంట్ నిలిచిపోయింది'

బాసర, ఏప్రిల్, 12 : మెయిన్ బటన్ ఆఫ్ చేయడం వల్లనే బాసర గోదావరి తీరంలోని శివాలయానికి గురువారం రాత్రి కరెంట్ నిలిచిపోయిందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కరెంట్ స్తంభం నుండి విద్యుత్ సరఫరా నిలిపి వేయలేదని పేర్కొన్నారు. ఇక దేవస్థాన ఆధీనంలో ఉన్న స్థలంలో గతంలో వ్యాపారం నిర్వహించిన వ్యక్తి కరెంటును వినియోగించుకొని సకాలంలో బిల్లు చెల్లించక రూ.62 వేలు బకాయి ఉందని చెప్పారు. ఆ బిల్లు క్లియర్ చేసిన తర్వాతనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు.

ఎస్సారెస్పీ నీటి కోటా వివాదం







- జిల్లాలో కాంగ్రెస్, బీజేపీల మధ్య 'వాటర్ వార్'
- సరస్వతీ కెనాల్, సదర్మాట్‌లకు నీటి విడుదలలో వివక్ష
- కోటాకు మించి పొరుగు జిల్లాకు తరలించారని ఆరోపణలు
- రబీ పంటలపై ప్రభావం

శ్రీహరి రావు



మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాలోని సరస్వతీ కాలువ, సదర్మాట్ బ్యారేజీకి నీటి విడుదల విషయంలో వివక్ష జరుగుతోందంటూ స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు ఆరోపిస్తున్నారు. చిలికి చిలికి గాలివానలాగా ఎస్సారెస్పీ నీటికోటా వ్యవహారం ఇటు కాంగ్రెస్ అటు బీజేపీల మధ్య మాటల యుద్ధానికి దారితీస్తోంది. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల వైఫల్యం కారణంగానే శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువకు కోటాకు అనుగుణంగా నీరు విడుదల జరగడం లేదంటూ బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ఆయన ఏకంగా ఈ విషయాన్ని ఇరిగేషన్ శాఖ ముఖ్యకార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లి ఫిర్యాదు చేశారు. దీని కారణంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో పాటు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, లోక్‌సభ అభ్యర్థి సుగుణక్క తదితరులంతా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్దకు సోమవారం రాత్రి వెళ్లి ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించారు. అలాగే సదర్మాట్, సరస్వతీ కాలువకు నీరును విడుదల చేయాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ నీటి విడుదల వ్యవహారం రబీ పంటలపై ప్రభావం చూపబోతుండగా బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య రాజకీయ ఆదిపత్యానికి ఆస్కారమిస్తోందంటున్నారు. ఇప్పటికే 68 వేల ఎకరాల పంటలకు సాగునీరు అందించే కడెం ప్రాజెక్టు కింద రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అడుగంటడంతో క్రాప్ హాలిడే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సదర్మాట్ బ్యారేజీ కింద డిస్ట్రిబ్యూటరీ 27, 28ల కోసం సరస్వతీ కాలువ ద్వారా మూడు టీఎంసీల నీరును యాసంగి పంటల కోసం అందించాల్సి ఉంది. ప్రాజెక్టు అధికారులు ఇప్పటి వరకు నీటి విషయంలో నాన్చివేత ధోరణి అవలంబిస్తుండడంతో సదర్మాట్ రైతాంగం ఆందోళన చెందుతోంది. సరస్వతీ కాలువ కింద దాదాపు 30 వేల ఎకరాల పంటలు సాగవుతుంటాయి. అయితే యాసంగి పంటల కోసం ఈసారి ఎస్సారెస్పీ నుంచి ఆరు టీఎంసీల నీరు విడుదల చేయాలని నిర్ణయించారు. కానీ కేవలం నాలుగున్నర టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేయడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, ప్రతిపక్ష పార్టీలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నేతల నిర్లక్ష్యం కారణంగానే సరస్వతి, సదర్మాట్ కాలువలకు అన్యాయం జరుగుతోందంటూ ఇప్పటికే బీజేపీ విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. మరో రెండు మూడు రోజుల్లో ఎస్సారెస్పీ నీరు కాలువలకు విడుదల కానట్లయితే కాంగ్రెస్, బీజేపీల మధ్య రాజకీయ దుమారం మొదలుకానుందని అటున్నారు.



కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

ప్రతీఏటా నీటి కోటాపై వివక్ష

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని కాకతీయ, సరస్వతీ, లక్ష్మికాలువలతో పాటు పలు ఎత్తిపోతల పథకాలకు ప్రతీఏటా యాసంగిలో ప్రభుత్వం నీటి కోటాను ఖరారు చేస్తుంది. అయితే ఈసారి సరస్వతీ కాలువకు ఆరు టీఎంసీల నీటి కోటాను కేటాయించగా ఇప్పటి వరకు కేవలం నాలుగున్నర టీఎంసీల నీరును మాత్రమే విడుదల చేశారు. పొరుగు జిల్లాకు చెందిన అధికార పార్టీ మంత్రి నిబంధనలకు విరుద్ధంగా వరదకాలువ ద్వారా 8 టీఎంసీల నీటిని ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరు, లోయర్ మానేరుడ్యామ్‌లకు తరలించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయంపై బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడమే కాకుండా బహిరంగంగా మీడియావేదికగా ఆరోపించారు. గతంలో కూడా సరస్వతీ కాలువకు కేటాయించిన కోటా మేరకు కాకుండా తక్కువ నీరును విడుదల చేశారని ప్రతీఏటా కాకతీయ కాలువకు కోటాకు మించి నీరును విడుదల చేస్తున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. చాలాసార్లు అప్పటి ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష నేతలు ఎస్సారెస్పీ వద్ద నీటి కోటా విషయంలో ఆందోళనలు కూడా చేసిన సంఘటనలున్నాయి.

ఎస్సారెస్పీలో తగ్గుతున్న నీటి మట్టం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం వేగంగా తగ్గిపోతుంది. ఈ ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 12.64 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాగా గత సంవత్సరం ఇదే రోజు నాటికి ప్రాజెక్టు రిజర్వాయర్‌లో 22.079 టీఎంసీల నీరు నిల్వ ఉండడం గమనార్హం. ఈ ప్రాజెక్టు ద్వారా మిషన్ భగీరథ కింద కోరుట్ల, జగిత్యాలకు 61 క్యూసెక్కులు, ఆదిలాబాద్, నిర్మల్‌కు 63 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డిలకు 107 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నారు. కాగా ఈ నెలాఖరు వరకు వరి పంట కోసం ప్రాజెక్టు నుండి అవసరమైన మేరకు నీరును విడుదల చేస్తేనే ప్రయోజనం ఉంటుందని లేనట్లయితే పంటలకు నష్టం తప్పదని అంటున్నారు.

హరిహర ఆలయంలో జాన్సన్‌నాయక్ పూజలు



ఆలయంలో జాన్సన్‌నాయక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పెంబి, ఏప్రిల్ 12 : మండల కేంద్రంలోని శ్రీ హరిహర 16వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ప్రధాన అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సల్ల నరేందర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, సుధాకర్, మహేందర్, మాజీ ఎంపీపీ సల్ల రామేశ్వర్‌రెడ్డి, నాయకులు గోవింద్, సరోజ, నరేందర్, సుతారి రమేష్, సుతారి మహేందర్, తదితరులు ఉన్నారు.

తనిఖీల్లో రూ. 5 లక్షలను పట్టుకున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

సారంగాపూర్, ఏప్రిల్ 12 : మండలంలో గల కౌట్ల(బి) ఎక్స్ రోడ్డు వద్ద నిర్మల్ స్వర్ణ రహదారిపై శుక్రవారం పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. మోటార్‌సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు ఎలాంటి పత్రాలు లేకుండా డబ్బు తీసుకువెళుతున్న పట్టుకున్నారు. గొసుకుల పోశెట్టి వద్ద రూ.3 లక్షల 50 వేలు, రాథోడ్ ప్రహ్లాద్ వద్ద రూ.1 లక్ష 50 వేలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 5 లక్షలను కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఈ వాహనాల తనిఖీల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.

ధైర్యంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



మండల కేంద్రంలో కవాతు చేస్తున్న పోలీసులు దృశ్యం

నర్సాపూర్(జి), ఏప్రిల్ 12 : ప్రజలు ధైర్యంగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ 99 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అమర్‌శర్మ, ఎస్సై మునిగెల హన్మాండ్లు అన్నారు. మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అమర్ శర్మ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో భాగంగా ముప్పై మంది సీఆర్‌పీఎఫ్ అధికారులు మండల కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో 99 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ విభాగం ఎస్సైలు సీ.యం.రెడ్డి, ఉపేందర్ కుమార్, ఏఎస్సై కొండయ్య, హెడ్ కానిస్టేబుల్ బీజు, కిరణ్‌కుమార్ సిబ్బంది మహేందర్ పాల్గొన్నారు.

మొరం ట్రాక్టర్ పై నుంచి పడి బాలుడి మృతి

- కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్‌లో విషాదం
- అక్రమంగా మొరం తరలిస్తుండగా ఘటన

ఖానాపూర్, ఏప్రిల్ 12 : మొరం ట్రాక్టర్ పైనుంచి పడి 13 ఏళ్ల బాలుడు మృతి చెందిన విషాద ఘటన కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం... నచ్చన్ ఎల్లాపూర్ గ్రామానికి చెందిన సుద్దాల రాజేష్ అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్ ద్వారా శుక్రవారం సాయంత్రం 6 సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్నారు. కాగా ఎటువంటి అనుభవం లేని అదే గ్రామానికి చెందిన గంధంశేఖర్ అనే వ్యక్తి సదరు మొరం ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. ఈ ట్రాక్టర్ పై అదే గ్రామానికి చెందిన ఊరే నర్సయ్య కుమారుడైన ఊరే శేఖర్ అనే 13 ఏళ్ల బాలుడిని ఎక్కించుకొని మొరం తరలిస్తూ ఉండగా ప్రమాదవశాత్తు ఊరే శేఖర్ ట్రాక్టర్ పైనుంచి పడ్డాడు. దీంతో ట్రాక్టర్ అతని పైనుండి ఎక్కడంతో అక్కడికక్కడే శేఖర్ మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. కాగా ట్రాక్టర్ నడిపిన డ్రైవర్ మైనర్‌గా ప్రచారం జరుగుతుండగా.. అతని వయసు తాలూకు ఇంకా ఎటువంటి ధ్రువపత్రాలు తమకు అందలేదని పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలంలో ఊరే శేఖర్ మృతదేహం.. పక్కన (ఫైల్)

అన్నతో మాట్లాడుకో.. లేదంటే అంతే!

- నూతన నిర్మాణాలు చేసే వారికి మున్సిపల్ సిబ్బంది బెదిరింపులు
- ఇటీవల ఓ న్యాయవాది ఇంటి నిర్మాణ స్థలం వద్ద వివాదం
- మున్సిపల్‌లో ప్రైవేట్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు
- డబ్బుల వసూళ్లే లక్ష్యంగా ఓ అధికారి సిబ్బందితో పని చేయిస్తున్నారనే ఆరోపణలు
- మున్సిపల్‌లో అధికార పార్టీకి చెందిన ఓ కీలక నేతపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ఖానాపూర్, ఏప్రిల్ 12 : అన్న నమస్తే ఎక్కడున్నావ్... అన్నతో మాట్లాడుకోమన్న ఏమైంది... పని ఆపమన్నప్పటికీ మనోడివని చూస్తున్నా... ఇది ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వాటర్‌సప్లై విభాగంలో పనిచేస్తున్న ఓ ప్రైవేట్ ఉద్యోగి నూతనంగా గృహనిర్మాణం చేసుకుంటున్న ఓ న్యాయవాదితో మాట్లాడిన ఫోన్ సంభాషణ... ఈ సంభాషణ సదరు ఏరియాలో కౌన్సిలర్‌గా ఉండి ఇటీవల మున్సిపల్‌లో ఓ కీలక పదవిని చేపట్టిన ఓ నేత ప్రస్తావనతో సాగింది. సదరునేతతో సెటిల్మెంట్ చేసుకోవాలని సంబంధిత మున్సిపల్ సిబ్బంది ఇంటిఓనర్‌కు స్వీట్‌గా వార్నింగ్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా ఇటీవల ఆ నిర్మాణం జరుగుతున్న ప్రదేశానికి వచ్చిన సదరు ఖానాపూర్ మున్సిపల్ వాటర్‌సప్లై విభాగంలో పనిచేస్తున్న ప్రైవేట్ ఉద్యోగి ఏకంగా దౌర్జన్యానికి పాల్పడ్డాడంటూ బాధితులు ఇటీవల ఖానాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు సదరు మున్సిపల్ ప్రైవేట్ ఉద్యోగి మీద కేసు నమోదు చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. కాగా పట్టణంలో ఇటీవల ఓ కీలకమైన పదవిని చేపట్టిన ఓ నేత వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు నేతతో పాటు గత కొద్దిరోజుల క్రితం ఇతర శాఖ నుంచి బదిలీపై మున్సిపల్‌లో కేవలం వార్డు ఆఫీసర్‌గా మాత్రమే పని చేయాల్సిన అర్హత కలిగిన ఆ అధికారికి ఏకంగా ఆయన స్థాయికి మించి బాధ్యతలు అప్పగించి పట్టణంలో కేవలం డబ్బులు వసూలు చేయడమే లక్ష్యంగా కొంతమంది సిబ్బందిని పురమాయించుకుని ఈ వసూళ్ల కార్యక్రమానికి తెరలేపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికార పార్టీకి చెందిన సదరు మున్సిపల్ పాలకవర్గంలోని కీలక నేత వ్యవహార శైలిపై పార్టీ శ్రేణులు సైతం ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. పార్లమెంట్ ఎన్నికల వేళ ఇటువంటి చర్యలు పార్టీకి సైతం నష్టం చేసేలా ఉన్నాయని కొంతమంది పార్టీ సీనియర్ నాయకులు అంతర్గతంగా ఈ వ్యవహారంపై సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఏడాది కాలంగా వెంచర్ నిర్వాహకులకు సంబంధిత ఏరియా కౌన్సిలర్‌కు మధ్య ఉన్న వివాదంతో తాను నలిగిపోతున్నానని వారిని తీసుకువచ్చి సెటిల్మెంట్ చేయాలని చెబితే తాను ఎక్కడి నుండి తీసుకు వస్తానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తాను అనుమతి పొందేందుకు దరఖాస్తు చేసుకుంటానని మున్సిపల్ కార్యాలయానికి వెళ్తే కూడా సంబంధిత నేతతో మాట్లాడుకోవాలని అధికారులు చెబుతున్నారే తప్పా తన దరఖాస్తును స్వీకరించడం లేదన్నారు. తమను కాదని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేస్తే కట్టిన చలానా డబ్బులు కూడా నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన తాను ఖానాపూర్‌లో ఓ ప్లాటు కొనుక్కుని ఇల్లు కట్టుకునేందుకు నానా తంటాలు పడుతుంటే తనను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సదరు బాధితుడు కోరుతున్నాడు.

పేపర్‌లో ఫొటోల కోసం కాంగ్రెస్‌ను విమర్శిస్తే ఊరుకోం..

- 65 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో ఎందుకు కూటమి పెడతారు?
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అర్థం లేని ఆరోపణలు మానుకో
- దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చెయ్
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డిపై కాంగ్రెస్ సీనియర్ నేత మల్లారెడ్డి ఫైర్

నిర్మల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పేపర్‌లో ఫోటోల కోసం బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే సహించేది లేదని నిర్మల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది ఆలూరి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 65 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో ఎందుకు కూటమి పెడతారో మహేశ్వర్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డిలపై మహేశ్వర్ రెడ్డి ఇష్టారీతిన ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. కావాలంటే మహేశ్వర్‌రెడ్డి ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో ఉండి బీజేపీ మతతత్వ పార్టీ అని చేసిన ఆరోపణల తాలూకు వీడియోలు అన్ని ప్రదర్శించేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేసిన మహేశ్వర్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు ఆరోపణలను నిరూపించడం లేదని మండిపడ్డారు. డి- 1 పట్టాల పంచాయతీ ఏమైందని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ఎన్నిరోజులు నిర్మల్ నియోజకవర్గంలో ఉన్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల వేళ నిర్మల్ నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు ముందుగా అమలు చేసి తర్వాత మాట్లాడాలన్నారు. తెలంగాణ బీజేపీ 12 సీట్లు గెలవబోతుందని ఇప్పుడు ఉప ఎన్నికలు వచ్చిన రాష్ట్రమంతా బీజేపీ గెలుస్తుందని చెబుతున్న బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి దమ్ముంటే నిర్మల్ నియోజకవర్గంలో రాజీనామా చేసి ఉప ఎన్నికకు వెళ్లాలన్నారు. అప్పుడు ఆయన సత్తా ఏంటో తెలుస్తుందని, అనవసరంగా కాంగ్రెస్‌పై ఆరోపణలు చేసేందుకు ఆయన ఇసుక రాయితో వస్తే తాము ఇటుక పెళ్లతో వస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధి శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు తీసుకున్న మహిళలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 : వివిధ ఉపాధి అంశాలలో శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. మహిళా సంఘ సభ్యులు సబ్బులు, డిటర్జెంట్, ఫినాయిల్, తదితర వాటి తయారీలో శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంక్ ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 12 : నెలవారీ మరమ్మతుల్లో భాగంగా శనివారం 11 కేవీ సాయిబాబా ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 7:30 నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అధికారులు తెలిపారు. దీంతో విశ్వనాథ్‌పేట్, వైఎస్ఆర్ కాలనీ, వేద ఆగ్రో ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. సోఫీనగర్, మారెమ్మ 11 కేవీ ఫీడర్ పరిధిలోను ఉదయం 8 నుంచి 11 వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు. సోఫీనగర్, ఆదర్శనగర్, ఇందిరమ్మ కాలనీ, శాస్త్రినగర్, శ్రీనగర్ కాలనీ, శాంతినగర్, మంచిర్యాల్ క్రాస్ రోడ్, విద్యానగర్‌లలో సైతం విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిర్గాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో..

దిలావర్‌పూర్, ఏప్రిల్ 12 : సిర్గాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆ శాఖ మండల ఏఈ శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా సిర్గాపూర్, కంజర్, సాంగ్వి, మల్లాపూర్, మాయాపూర్, ఒడ్డేపల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగ దారులు సహకరించాలని ఏఈ శ్రీనివాస్ కోరారు.

ఉపాధి హామీ కూలీలకు ఆర్‌పీఎఫ్ ద్వారా ఫిల్టర్ వాటర్ సరఫరా



కూలీలకు ఫిల్టర్‌వాటర్‌ను సరఫరా చేస్తున్న దృశ్యం

ముధోల్, ఏప్రిల్ 12 : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో రమ్యప్రసాద్ స్వచ్ఛంద సేవాసంస్థ (ఆర్‌పీఎఫ్) ద్వారా ఉపాధిహామీ కూలీలకు ఫిల్టర్‌వాటర్‌ను సరఫరా చేస్తున్నారు. ముందుందు మరిన్ని ఉచిత సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

సరిహద్దుల్లో పటిష్ఠమైన నిఘా పెట్టండి

● ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

బోథ్, ఏప్రిల్ 12 : ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సరిహద్దులలో పటిష్ఠమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోథ్ సీఐ కార్యాలయంలో సీఐ బి.రమేష్‌తో కలిసి బోథ్, బజార్హత్నూర్ ఎస్సైలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించాలన్నారు. అంతేగాక మద్యం విక్రయాలను కట్టడి చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. మద్యంతో పాటు గంజాయి రవాణాపై దృష్టి సారించాలని డీఎస్పీ సూచించారు.



ఇచ్చోడ ప్రభుత్వాసుపత్రికి ప్రహరీ లేని దృశ్యం

ఇచ్చోడలో ఆసుపత్రికి ప్రహరీ నిర్మించేనా?

● అత్యవసర సమయంలో రోగులకు తప్పని ఇబ్బందులు

ఇచ్చోడ, ఏప్రిల్12 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గతంలో భారీ వర్షాల కారణంగా ఒకవైపు కూలిపోయి రెండేళ్లకు పైగా గడిచిపోయింది. ఆ పక్కనే ఆర్అండ్‌బీ వంతెన నిర్మించడంతో ఆసుపత్రి గేటు కనిపించకుండా పోయింది. దీంతో గేటుకు కొంచెం పక్కన పగిలిన ప్రహరీని ప్రధాన దారిగా మార్చుకొని రాకపోకలను సాగిస్తున్నారు. మిగిలినది కూడా ఒక వైపు వంగిపోయి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ప్రహరీ కూలిపోవడంతో ఆసుపత్రి ప్రాంగణంలో మూగజీవాలు విచ్చవిడిగా సంచరిస్తుండటతో చికిత్స కోసం వచ్చే రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళ మందుబాబులు చెట్ల కింద కూర్చుని మద్యం తాగి ఆ సీసాలను అక్కడే వదిలివెళుతున్నారు. అత్యవసర సమయంలో రాత్రుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులు ఆసుపత్రి బయటి ప్రాంతమంతా చీకటిగా ఉంటోంది. ఏపుగా పెరిగిన చెట్లలో కుక్కలు, మూగజీవాలు ఉండడంతో పడరాని పాట్లు పడుతూ.. ఆసుపత్రికి రావాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో విధిదీపాలు ఏర్పాటుచేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా.. పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ప్రహరీ నిర్మాణం చేయాలని కోరుతున్నారు.



ఆస్పత్రిలో కూలిన ప్రహరీ పక్కనుంచి వస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌లో పడిపోయిన ఉష్ణోగ్రతలు

● జిల్లాలో 30.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగైదు రోజులుగా జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలకు ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. శుక్రవారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 30.5 డిగ్రీలు కాగా.. కనిష్ట ఉష్ణోగ్రతలు 21.7గా నమోదయ్యాయి. వారం రోజుల క్రితం వరకు 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. కురిసిన చిరుజల్లులతో వాతావరణం చల్లబడడంతో జిల్లావాసులకు ఉపశమనం కలిగింది. అయితే కురుస్తున్న వర్షాలతో చేతికొచ్చిన జొన్న పంట కోతలు నిలిచిపోతున్నాయని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. మండువేసవిలోనూ ఉదయం సాయంత్రం వేలల్లోనూ చల్లని ఈదురు గాలులు వీస్తున్నాయి. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గమ్యం యాప్‌పై ప్రయాణికులకు అవగాహన

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 12: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు గమ్యం యాప్‌పై శుక్రవారం ఆర్టీసీ అధికారులు అవగాహన కల్పించారు. ఆర్టీసీ ప్రవేశపెట్టిన ప్రతీ కార్యక్రమాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ప్రయాణికులకు ఎప్పటికప్పుడు చేరవేస్తూ ఉంటుందని, అందులో భాగమే గమ్యంయాప్ అని రీజినల్ మేనేజర్ సోలోమాన్ తెలిపారు. ఈ యాప్‌ను ప్రతీ ప్రయాణికుడు కూడా గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఆర్టీసీ బస్సు వివరాలు సులభంగా తెలుసుకోవచ్చని వివరించారు. అదే విధంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం ఎంత సుఖవంతం, సురక్షితం అని వివరిస్తూ రోడ్డు భద్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఇందులో రీజినల్ మేనేజర్ శ్రీప్రణీత్, ప్రవీణ్‌కుమార్, డిపో మేనేజర్ కల్పన, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రూపశిల్పి ఆడియో సాంగ్ విడుదల

ఇచ్చోడ, ఏప్రిల్ 12: ఇచ్చోడ మండలానికి చెందిన పలువురు యువకులు రాజ్యాంగ రూపశిల్పి ఆడియోసాంగ్‌ను రూపొందించారు. శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆడియోసాంగ్‌కు సంబంధించిన సీడీని విడుదల చేశారు. జైభీమ్ జైభీమ్ రాజ్యాంగ రూపశిల్పి ఆడియోసాంగ్‌ను అందరూ ఆదరించాలని పాట రచయిత పాముల మనోజ్, గాయకుడు విజయ్ జుపాకి, సంగీతం డీజేశేఖర్‌లు అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు భగత్ కాశీనాథ్, గంగధర్, సోమేష్ సర్పె, పట్ల బాపురావ్, భీమ్‌రావు, మోతీరాం, శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం చలి వేంద్రం ఏర్పాటు

బోథ్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో శుక్రవారం గ్రామ పంచాయితీ ఈవో అంజయ్య వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివిధ పనుల నిమిత్తం మండలంలోని వివిధ మార్గాలు, ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే వారు కాకుండా ఇతర పనులపై వివిధ ప్రాంతాలను ఎంతో మంది రావడం జరుగుతుందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చలివేంద్రం ఏర్పాటు చేశామని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన ఎంపీ అభ్యర్థి



మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి

బోథ్, ఏప్రిల్ 12: మండలంలోని గుర్రాల తండా గ్రామానికి చెందని మాజీ సర్పంచ్ సకరంను శుక్రవారం మాజీ ఎంపీ బీజేపీ అభ్యర్థి అయిన జి.నగేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ముస్తాపురి అశోక్, బీజేపీ మండల కన్వీనర్ బోరే రవీందర్, మాజీ మండల కన్వీనర్ సుభాష్, సూర్య జడ్పీటీసీ రాజు, తదితరులు ఉన్నారు.

అడుగంటి పోతున్న కరత్వాడ చెరువు



తగ్గిన నీటిమట్టంతో కరత్వాడ చెరువు

బోథ్, ఏప్రిల్ 12 మండలంలోని కరత్వాడ గ్రామం సమీపంలో ఉన్న చెరువు అడుగంటిపోతుంది. ఫలితంగా మండలంలో భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయి. తరువాత జీవనది అయిన పెద్దవాగు నీటి ప్రవాహం ఉంది. అయితే ఈ ఏడాది వర్షపాతం పరిస్థితులు నెలకొనడంతో చెరువు అడుగంటింది. ఫలితంగా చెరువులు గతంలో చెరువు తవ్వకానికి ముందు ఉన్న బీటీ రోడ్డు బయట పడింది. నీటిమట్టం రోజురోజుకు తగ్గిపోవడంతో ముందు ముందు చెరువు పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు వాపోతున్నారు. ప్రతి ఏడాది రబీ పంటకు కుడి, ఎడమ కాలువల ద్వారా ఈ చెరువు నీరు అందేది అయితే ఈ ఏడాది ఎండల తీవ్రత వల్ల నీరు అడుగంటి పోవడంతో కాలువల ద్వారా నీటిని విడుదల చేయలేదు. ఫలితంగా రబీ పంట వేసిన రైతులు నీటి దడువులందగా నష్టపోయారు. కరత్వాడ చెరువు ఉండటంతో చుట్టు పక్కల ఉన్న బోరు బావులు సైతం నీటి నిల్వలు అడుగంటిపోయాయి.

మారుమూల గ్రామాలకు తాగునీరు

● అదనపు కలెక్టర్ దీపక్‌తివారి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 12: జిల్లాలోని మారుమూల గ్రామాలకు సైతం నిరంతరం తాగునీటి సరఫరాకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈక్రమంలో దినపత్రికల్లో వచ్చిన వార్త కథనాలపై తక్షణమే స్పందిస్తూ పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. జిల్లాలో జైనూరు మండలం జంగాం గ్రామపంచాయతీలో 614ఆవాసాలు, 2,398జనాభా ఉండగా గ్రామ పంచాయతీ పరిధిలోని నడక్‌గూడ గ్రామంలో 113ఆవాసాలు, 576మంది జనాభా ఉన్నారని తెలిపారు. జంగాంలో నీటి అవసరాలు తీర్చేందుకు పది చేతి పంపులు, ఏడు మోటార్లతో బోర్‌వెల్స్, 4మోటార్లతో కూడిన బహిరంగ బావులు, ఒకమోటారు లేని బహిరంగ బావి, మిషన్‌భగీరథ పథకంలో 40 కేఎల్ వోహెచ్ఎస్ఆర్-3, 20కేఎల్, 40 కేఎల్-1, 20 కేఎల్‌జిఎల్ఆర్ ఆర్వో ప్లాంటు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో సంబంధిత అధికారుల సమన్వయంతో ఇంటింటికి తిరుగుతూ తాగునీటి సరఫరా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బోరుబావులకు మరమ్మతులు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జైనూరు, ఏప్రిల్ 12: 'జంగాంలో తాగునీటి కటకట' అనే శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన వార్త కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎంపీడీవో ప్రభుదాస్, ఏఈ ఖలీల్, పంచాయతీ కార్యదర్శి మధుకర్ జంగాం, నడక్‌గూడ గ్రామాలను సందర్శించి తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని బోరుబావులకు వెంటనే మరమ్మత్తులు చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలకు మంచినీటి సదుపాయం కల్పించారు.

భక్తి భావంతోనే మానసికోల్లాసం

లింగాపూర్, ఏప్రిల్ 12: భక్తిభావంతోనే మానసికోల్లాసం కలుగుతుందని రామ్‌సింగ్ మహరాజ్ అన్నారు. లింగాపూర్‌మండలంలోని మాడిపల్లి వంజారి గూడ గ్రామంలో 7రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో ఆయన భక్తులనుఉద్దేశించి మాట్లాడారు. సప్తాహలో పాల్గొంటే మానసికోల్లాసంతో పాటు భక్తిభావం పెరుగుతుందన్నారు. ఏడురోజుల పాటు జరిగిన అఖండ హరి నామ సప్తాహ శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో గ్రామస్థులు విశ్వంబర్, బివాజీ, నాతారావు, గోవింద్, ఉమాకాంత్, పాండురంగ్, మారుతి, విజయ్, ఏకనాథ్, ఆదినాథ్, గంగా, గ్రామస్థులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో హనుమాన్, సేవాలాల్ దీక్షలు

లింగాపూర్ ఏప్రిల్ 12: మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో సంత్ సేవాలాల్ మహరాజ్ దీక్షలతోపాటు హనుమాన్ దీక్షలు తీసుకుంటున్నారు. దీంతో మండలం అంతా భక్తిభావంతో పండుగ వాతావరణంలా ఉంది.

పల్లెల్లో.. పడకేసిన పాలన

● నాలుగు నెలలుగా పంచాయతీ కార్మికులకు అందని వేతనాలు ● వారంరోజుల నుంచి విధుల బహిష్కరణ ● గ్రామపంచాయతీల పాలనపై ప్రత్యేకాధికారులకు పట్టింపు కరువు
● క్షేత్రస్థాయిలో కొరవడుతున్న స్థానిక అధికారుల పర్యవేక్షణ



జెండాగూడలోని నర్సరీలో ఎండిపోయిన మొక్కలు



కుంటగూడలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తచెదారం

సిరికొండ, ఏప్రిల్ 12 : నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని మండలంలోని పలు గ్రామపంచాయతీలకు చెందిన పంచాయతీ కార్మికులు గత వారం రోజులుగా తమ విధులు బహిష్కరించారు. దీంతో మండలంలోని పలుపల్లెల్లో పంచాయతీ ట్రాక్టర్ పడకేయగా.. చెత్తచెదారంతో మురికికాలువలు నిండిపోయి దుర్వాసన వెదజల్లుతూ రోడ్లన్నీ అధ్వాన్నంగా మారుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రామపంచాయతీల పర్యవేక్షణ, పారిశుధ్య నిర్వహణ కొరకు ప్రభుత్వం ప్రతీ గ్రామపంచాయతీకి పంచాయతీ కార్మికులను నియమించింది. వీరు ప్రతీరోజూ పల్లెల్లో చెత్తచెదారం తొలగిస్తూ.. ట్రాక్టర్ ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించేవారు. మొక్కలకు నీరు పెట్టడం, మంచినీటిని అందించడం వంటి పనులను చేపట్టేవారు. వేసవి కాలం దృష్ట్యా పలు గిరిజన గ్రామాల్లో తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించడంతో మంచి నీటి ట్యాంకర్‌ను తోలేవారులేక ఆదివాసీలు పలు అవస్థలకు గురవుతున్నారు. కాగా పంచాయతీ కార్మికులు తమ నాలుగు నెలలకు చెందిన వేతనాలు చెల్లిస్తేనే తాము తిరిగి విధులు చేపడుతామని డిమాండ్ చేస్తున్నారు. గత రెండు నెలల క్రితం సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం పంచాయతీ పాలన బాధ్యతలను ప్రత్యేకాధికారులకు అప్పగించింది. దీంతో ప్రతీ గ్రామపంచాయతీకి కేటాయించిన ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పల్లెల పరిస్థితి తయారైంది. పల్లెల్లో ప్రతీరోజూ చేపట్టే పల్లెప్రగతి పనులను పర్యవేక్షణ చేయాల్సిన అధికారులే గ్రామాలను సందర్శించకపోవడంతో పల్లెవాసుల కష్టాలను ఎవరు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామాల్లోని చెత్తచెదారం మురికి కాలువల్లో చేరి నిండిపోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా మురికి నీరంతా తమ ఇళ్లల్లోకి చేరుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతో ఈజీఎస్ పనులు కరువు

సిరికొండ, ఏప్రిల్ 12 : పలు గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది తమ విధులను సరిగ్గా నిర్వర్తించకపోవడంతో పనిఅడిగిన కూలీలకు పనికల్పించలేకపోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో కూలీలకు జాబ్‌కార్డులు లేకపోవడంతో పనికి వెళ్లలేకపోతున్నామని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో గత రెండు సంవత్సరాలుగా ఉపాధి పనికి వెళ్ళినా...తమ కూలీ డబ్బులు రావడం లేదని అంటున్నారు. ఒకవేళ వచ్చిన అందులో నుంచి సగం డబ్బులు పై అధికారులకు ఇవ్వాలని ఉపాధి హామీ సిబ్బంది డిమాండ్ చేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే మండలంలోని అనేక గ్రామాల్లో ఇప్పటికీ నర్సరీలను సైతం ఏర్పాటుచేయకపోవడంతో వచ్చే వానాకాలం సీజన్ నాటికి తమ లక్ష్యాన్ని చేరడం గగనంగానే కనిపిస్తుంది.

రాముడిని మొక్కుతాము.. బీజేపీని తొక్కేస్తాము

● కాంగ్రెస్ పార్టీ హామీలు 420 ● అమలు చేయడంలో విఫలం ● బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తాం
● బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి జోగు రామన్న



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

తలమడుగు, ఏప్రిల్ 12: శ్రీరాముని పేరు చెప్పుకొని బీజేపీ పార్టీ ఓట్ల రాజకీయం చేస్తుందని శ్రీరాముని మొక్కుతాం బీజేపీని తొక్కేస్తామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో బోథ్ నియోజక వర్గంలోని తాంసి, తలమడుగు, భీంపూర్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోగురామన్న మాట్లాడుతూ బీజేపీ పార్టీ ఓట్ల కోసం కులాల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. కేవలం పదవుల కోసం శ్రీరాముని వాడుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత పది సంవత్సరాల్లో బీజేపీ పార్టీ చేసింది ఏమి లేదన్నారు. ప్రజలను మోసం చేయడం తప్ప చేసింది ఏమి లేదని ఆయన ఆరోపించారు. అదే విధంగా మొన్నటి వరకు బీఆర్ఎస్ పార్టీలో ఉన్న బీజేపీ ఎంపీ అభ్యర్థికి హిందుత్వం గురించి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని దుయ్యబట్టారు. బీజేపీ అభ్యర్థికి పదవులు తప్ప ప్రజల శ్రేయస్సు పట్టదన్నారు. అదే విధంగా గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని 420 హామీలు ఇచ్చి వంద రోజులైనా ఇప్పటి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో కల్యాణ లక్ష్మీ, తులంబంగారం ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. అంతేకాకుండా దేశానికి అన్నం పెట్టే రైతులను కూడా మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో రెండు లక్షల రుణమాఫీ ఎకరానికి రూ.15వేల రైతుబంధు ఇస్తానని చెప్పి ఇవ్వలేదన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రంసక్కును భారీ మెజార్టీతో ప్రతి కార్యకర్త సైనికులుగా పని చేసి గెలిపించి కేసీఆర్‌కు కానుకగా అందిద్దామన్నారు. గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటింటికి తీసుకెళ్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పాటు పడాలని కోరారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తకు ఖచ్చితంగా గుర్తింపు లభిస్తుందన్నారు. బోథ్ నియోజక వర్గ కార్యకర్తలు జిల్లాకే ఆదర్శంగా పని చేయాలని సూచించారు. బోథ్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి 90వేల మెజార్టీ వచ్చే విధంగా బూత్ స్థాయిలో కార్యకర్తలు పాటుపడాలని కోరారు.

ఒక్క అవకాశం ఇవ్వండి : బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కు

అన్ని రంగాల్లో వెనుకబడ్డ ఆదివాసుల ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కు కోరారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజక వర్గం తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో ఆదిలాబాద్ జిల్లా వెనుకపడ్డదన్నారు. గతంలో బీజేపీ ఎంపీగా పని చేసిన సోయాంబాపురావు ఏ ఒక్కరోజు కూడా సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎమ్మెల్యేగా ఎంపీగా మంత్రిగా చేసిన ఆయనకు ప్రజా సమస్యలు పట్టవన్నారు. కేవలం పదవుల కోసమే పార్టీలు మారుస్తారన్నారు. గ్రామాల్లోకి వస్తే వారి నిలదీయాలని కార్యకర్తలకు సూచించారు. త్యాగాలు చేస్తేనే మంచి పదవులు వస్తాయన్నారు. తాను ఎమ్మెల్యే పదవి త్యాగం చేయడంతోనే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం మాజీ సీఎం కేసీఆర్ కల్పించారన్నారు. కార్యకర్తలు అంతా వర్గ విబేధాలు పక్కన పెట్టి ఐక్యంగా పార్టీ గెలుపు కోసం పాటుపడాలని సూచించారు.

కార్యకర్తలు మారరు : బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

పదవుల కోసం నాయకులు మారిన కార్యకర్తలు ఎవరు కూడా పార్టీలు మారరని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఎవరూ ఇతర పార్టీలో బలవంతంగా చేర్చుకోలేరని చేరిన ఆ పార్టీల వారు ఉండలేరని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఇటీవల బీజేపీ కాంగ్రెస్ పార్టీలో కొంత మంది కార్యకర్తలను ఆ పార్టీ నాయకులు బలవంతంగా చేర్పించారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎవరు కాంగ్రెస్, బీజేపీ పార్టీలోకి వెళ్లడం లేదన్నారు. పార్టీ కోసం పాటుపడ్డ కార్యకర్తలకు అండగా ఉంటానని త్వరలో జరిగే లోకల్ బాడీ ఎన్నికల్లో కష్టపడ్డ కార్యకర్తకు ఖచ్చితంగా గుర్తింపు లభిస్తుందన్నారు. అంతేకాకుండా బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికులుగా పని చేయాలని కోరారు. రుయ్యాడి గ్రామం తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శమని అందుకే రుయ్యాడి గ్రామంలో నుంచి బీఆర్ఎస్ పార్టీల కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేశ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కేదరేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అభిరామ్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, భీంపూర్ జడ్పీటీసీ సుధాకర్, పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ముట్టికిరణ్, దత్తాత్రేయ రాంబాయి, నర్సింగ్, కె.శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరెడ్డి, గంగాధర్, ప్రవీణ్, ఎంపీటీసీ చంటి, మాజీ సర్పంచ్‌లు పొచ్చన్న, ఆనంద్, బూత్ నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేసి పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించండి

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ , పక్కన అభ్యర్థి సుగుణ



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు , కార్యకర్తలు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 12 : రానున్న ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణని భారీ మెజారిటీతో గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదిలాబాద్‌పైన ఎంతో ప్రేమ ఉందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే మన లక్ష్యమన్నారు. సైనికులుగా పనిచేసి ఆదిలాబాద్ పార్లమెంట్ చరిత్రలో మొట్టమొదటిసారిగా అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన అంశాలపై పార్టీ కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపిస్తే జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తామని హామీనిచ్చారు. ఆత్రం సుగుణకు మద్దతు ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. తెలంగాణ ప్రజలకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి గిఫ్ట్‌గా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారని, అలాగే ఎంపీ అభ్యర్థిని కూడా గెలిపించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ కొందరు నాపై మత మార్పిడికి పాల్పడినట్లు ఆరోపణలు చేస్తున్నారని, నేను మత మార్పిడికి పాల్పడినట్లు నిరూపిస్తే ఆదివాసీ గిరిజన అమరవీరుల సాక్షిగా తల నరుక్కుంటానన్నారు. రాహుల్ గాంధీ దేశ ఐక్యత కోసం కృషి చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల గురించి మాట్లాడటం తప్ప ప్రజలకు చేసిందేమి లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఐదు అమలు చేసిందన్నారు. మీ బిడ్డగా ఆశీర్వదించి గెలిపించండి, నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తంచేశారు. అంతకు ముందు వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వాగ్మారే భారత్, సిడ్మేక ఆనంద్‌రావు, ఎం.డి.మసూద్, సోమోరే నాగోరావు, మండల అధ్యక్షులు ముఖడే ఉత్తం, సోన్ కాంబ్లే, జితేందర్, పట్టణ అధ్యక్షులు ఎండి జహార్ తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



సాంగ్వి(కె)లో పోచమ్మ తల్లికి మొక్కుతున్న ఎమ్మెల్యే పాయలశంకర్

ఆదిలాబాద్ నియోజక వర్గ

ప్రజలు సుఖశాంతులతో ఉండాలి

● ఎమ్మెల్యే పాయల శంకర్

జైనథ్, ఏప్రిల్ 12: నియోజక వర్గంలోని జైనథ్, బేల, ఆదిలాబాద్ మండలాలతో పాటు పట్టణ కేంద్రమైన ఆదిలాబాద్ ప్రజలు పాడి పంటలతో సుఖశాంతులతో ఉండాలని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శుక్రవారం సాంగ్వి గ్రామస్థుల భాగస్వామ్యంతో నిర్మించిన ఆలయంలో పొచమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి మేకలు, కోళ్లను బలిచ్చి మహిళలతో కలిసి నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిపిరెడ్డివిఠల్‌రెడ్డి, బీజేపీ నాయకులు మయూర్‌చంద్ర, సామఅశోక్‌రెడ్డి, భూమన్న, సురేస్, తరుణ్, వైభవ్, సురేష్, అశోక్‌లతో పాటు సాంగ్వి(కె) గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి అశ్విన్‌రెడ్డి

నేరడిగొండ, ఏప్రిల్ 12: కార్యకర్తలకు అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి అశ్విన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మండలానికి చెందిన నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త ఏలేటి అశ్విన్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ పార్టీలో మీరు ఉండాలని చాలా మంది కార్యకర్తలు మానసిక క్షోభకు బోథ్ నియోజక వర్గంలో గురిఅవుతున్నారని, ఇలాగే జరిగే భవిష్యత్‌లో కార్యకర్తలు సీనియర్ నాయకులు కనుమరుగయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మీరు ముందు ఉండి మా కార్యకర్తల్ని నడిపియ్యాలని మీరు ప్రచారంలో మమ్మలను కలుపుకొని మీరు నడవాలని తెలిపారు. ప్రతీ కార్యకర్త పని చేయడానికి సన్నద్ధంగా ఉన్నారు. కానీ కార్యకర్తలను పట్టించుకునే నాయకుడు లేడని వాపోయారు. మీరే ముందుండి మాలాంటి చాలా మంది కార్యకర్తలకి ధైర్యం అవ్వాలి అని తెలియజేశారు. ఈ విషయానికి అశ్విన్‌రెడ్డి స్పందించి ప్రతి కార్యకర్తకు ధైర్యం ఇస్తానని మీ వెంట నేను ఉంటానని రాబోయే ఎలక్షన్‌లో మనం అందరి కలిసి ప్రచారం చేద్దాని సానుకూలంగా అశ్విన్‌రెడ్డి కార్యకర్తలకు మనోధైర్యాన్ని ఇచ్చారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు జాదవ్‌వసంత్, సీనియర్ నాయకులు నల్ల శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి,తొడసందౌలత్‌రావు, రామ్‌లక్ష్మణ్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నరేష్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, రాజేశ్వర్, డాబా కె.మాజీ సర్పంచ్ మండే బాలాజి, శ్యామ్, సతీష్‌యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడాల అనిష్‌కుమార్, మద్దెల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

16న జిల్లాకు కేటీఆర్

బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న

తలమడుగు, ఏప్రిల్12: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 16న ఉదయం 10గంటలకు మాజీ మంత్రి టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదిలాబాద్ జిల్లాకు వస్తున్నారని జిల్లా పార్టీ అధ్యక్షుడు జోగురామన్న తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏడు నియోజక వర్గంలో గల బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం ఈ నెల 16న జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్‌లో ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని 2011 బూత్ కేంద్రాల నుంచి 4వేల మంది బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుల పని చేయాలని సూచించారు. పార్టీకి కార్యకర్తల బలం బలగమని ఆయన అన్నారు. ఇందులో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళ అదృశ్యం



నిర్మలబాయి

బోథ్, ఏప్రిల్ 12: మండలంలోని మహదుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ నిర్మల బాయి ఈనెల 5 నుంచి కనిపించకుండా పోయిందని భర్త ప్రకాష్ శుక్రవారం సాయంత్రం బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎప్పటి వలే సోనాల గ్రామానికి వెళుతున్న అని చెప్పి ఇంటి నుంచి ఈనెల 5న బయలు దేరిందని భర్త పేర్కొన్నారు. ఇంటి నుంచి వెళ్లిపోయినప్పటికీ నుంచి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇండ్లలో వెతికామని ఎక్కడ కూడా ఆమె జాడ తెలియపోవడంతో ఫిర్యాదు చేశామన్నారు. 5వ తేదిన సోనాల గ్రామంలో తమ బంధువులకు కనిపించినట్లు తెలిపారన్నారు. సోనాల నుంచి ఎటు వెళ్లిన విషయం తెలియడం లేదన్నారు. ఆమెకు తొమ్మిది సంవత్సరాల కొడుకు ఏడు సంవత్సరాల కూతురు ఉందన్నారు. ఈ మేరకు స్థానిక ఎస్సై బి.రాము కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



కల్తీ కల్లును తయారు చేస్తున్నారిలా..



● తలమడుగు మండలంలో కల్తీ కల్లును ధ్వంసం చేస్తున్న ఆదివాసీ గిరిజన మహిళలు



జోరుగా కల్తీ కల్లు.. దందా

- జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్న కల్లు అమ్మకాలు
- డిమాండ్‌కు సరిపడేలా విష రసాయనాలతో కల్తీకల్లు తయారీ
- మద్యంప్రియుల అలవాటు ఆసరాగా దండుకుంటున్న వ్యాపారులు
- అమాయక జనాన్ని చుట్టు ముడుతున్న భయంకర వ్యాధులు
- తాజాగా తలమడుగు మండలంలో కల్లుబట్టీలపై గిరిజన మహిళల దాడి
- 'మామూలు'గానే తీసుకుంటున్న ఎక్సైజ్ అధికారులు
- జిల్లావ్యాప్తంగా అధికారికంగా 300లకు పైగా కల్లు దుకాణాలు ఉన్నా.. అనధికారికంగా మరెన్నో..

ఆదిలాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి)/ తలమడుగు: జిల్లాలో జోరుగా కల్తీకల్లు దందా కొనసాగుతోంది. వేసవికాలం కావడంతో ఎండ తాపానికి కల్తీ కల్లును ఆశ్రయిస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఏదో అలసటను తీర్చుకునేందుకు అలవాటు పడ్డ మద్యంప్రియులు.. కల్తీ కల్లు బారీన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. అమాయక జనం అలవాటును ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు నిత్యం లక్షల రూపాయలను వెనుకేసు కుంటున్నారు. వేసవిలో కల్తీ కల్లు అమ్మకాలు మరింత పెరిగిపోవడంతో రెండు చేతుల సంపాదిస్తున్నారు. చౌకగా దొరికే కల్తీ కల్లును తాగే వారంతా పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలే కావడంతో భయంకర వ్యాధుల బారీన పడి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. అంతేకాకుండా ఈ మహమ్మారి బారీన పడి జిల్లాలో ఎందరో మంది బాధితులు ఆసుపత్రుల పాలవుతున్నారు. ఏదో మారుమూల గిరిజన ప్రాంతాల్లో తయారయ్యే గుడుంబాపై అతి ఉత్సాహాన్ని చూపే అధికారులు.. కళ్లముందే కనిపిస్తున్న కల్తీ కల్లుపై ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదో? వారికే తెలియాలి అంటున్నారు. సబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులకు ఇదంతా కల్తీ కల్లు అని తెలిసినా.. అటువైపు కన్నెత్తి చూడక పోవడంపై విమర్శలు వస్తు న్నాయి. తాజాగా తలమడుగు మండలంలోని కోసాయి, ఉమ్రితో పాటు తదితర గ్రామాల్లో కల్లుబట్టీల నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఆదివాసీ మహిళలు ఆందోళనకు దిగి కల్లు నిల్వలను ధ్వంసం చేశారు. అంతేకాకుండా జిల్లావ్యాప్తంగా సుమారుగా 300లకు పైగా కల్లు దుకాణాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నా... అనాధికారికంగా మాత్రం విచ్చలవిడిగా కల్లు అమ్మకాలు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం కల్లు గీసే వారు చెట్ల కిందనే అమ్ముకోవాల్సి ఉన్నా.. ఎక్కడా కూడా ఈ నిబంధనలు అమలు కావడం లేదు. కొన్ని సందర్భాల్లో డోస్ ఎక్కువ కావడంతో ప్రాణాలే పోతున్నాయి. ఇంత జరుగుతున్నా.. ఎక్సైజ్ అధికారులు 'మాములు'గానే తీసుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

జోరుగా కల్లు అమ్మకాలు

వేసవిలో కల్లు అమ్మకాలు పెరిగిపోవడంతో.. డిమాండ్‌కు సరిపడా ప్రమాదకర రసాయనాలతో తయారు చేస్తూ అమ్మకాలు జరుపుతున్నారు. జిల్లాలో ఈత, తాటి వనాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వీటి నుంచి వచ్చేది గోరంత అయితే.. అమ్మేది మాత్రం కొండంతగా కనిపిస్తోంది. అయితే చెట్ల నుంచి తీసిన కల్లును కేవలం కుండల్లోనే చెట్ల వద్దనే అమ్ముకోవాలి. భారీగా డిమాండ్ ఏర్పడడంతో కల్తీ కల్లును తయారు చేసి సీసాల్లో నిల్వ చేస్తూ పెద్ద మొత్తంలో దందా చేస్తున్నారు. పెద్దపెద్ద డ్రముల్లో కలుపుతూ కుంకుడు కాయరసం, నిమ్మ ఉప్పు, చక్కెర, సాక్రిన్, యూరియా, క్లోరోఫాం, డైజోఫాం, అల్ఫోజం వంటి మత్తు పదార్థాలను కలుపుతున్నట్లు తెలుస్తుంది. కల్తీ కల్లు తయారీలో ప్రమాదకర రసాయన పదార్థాలను వాడుతున్నా.. అధికారులకు పట్టింపే లేకుండా పోయింది. అడపదడప కల్తీ కల్లు శాంపులను సేకరించి నామమాత్రంగానే పరీక్షలు చేస్తూ.. వదిలేస్తున్నట్లు తెలుస్తుంది. కల్తీ కల్లుపై పర్యవేక్షణ లేకుండా పోవడంతో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం లైసెన్స్ కలిగిన వారు చెట్ల వద్దనే కనీసం చక్కెర కూడా కలుపకుండా అమ్ముకోవాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే గ్రామాల్లో జోరుగా కల్తీకల్లు అమ్మకాలు జరుగుతున్నాయి.

కల్తీ కాటుకు ప్రాణాలు బలి

తెలియకుండానే కల్తీ కల్లుతో అమాయక జనం ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఏదో సరదాగా అలవాటైనా కల్లుకు యువకులు బానిసగా మారిపోతున్నారు. కల్తీ కల్లు తాగనిదే నిద్ర కూడా పట్టడం లేదని వాపోతున్నారు. కల్తీ కల్లును తాగే వారంతా పేద, మధ్య తరగతి వారే కావడంతో భయంకర వ్యాధుల బారీనపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి ములుగుతున్నారు. ఇప్పటికే కల్తీకల్లుబారీన పడి ఎందరో మంది యువకులు సైతం ప్రాణాలు పొగొట్టుకున్న దాఖలాలు ఉన్నాయి. అయితే ఏదో సంఘటన జరిగితే తప్ప ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసిన పరిస్థితి కనిపించడం లేదు. ఫిర్యాదు చేసినప్పుడే హడావుడి చేస్తూ.. ఆ తర్వాత అంతా 'మామూలు'గానే మారిపోతుందని స్థానికులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటే ఏఒక్క కల్లు దుకాణం నడవదంటూ కొందరు ఎక్సైజ్ అధికారులే బహిరంగంగా చెప్పడం గమనార్హం. ఒక్కో చెట్టు నుంచి రెండు, మూడు లీటర్ల కల్లు వస్తున్నా.. జిల్లాలో ప్రతీరోజు వేల లీటర్ల కల్తీకల్లు అమ్మకాలు జరపడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో అనుమానాస్పదంగా కల్లుబట్టిల్లోనే మరణాలు సంభవిస్తున్నా.. బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు.

గిరిజన మహిళల దాడి

తమ గూడాల్లో మత్తు పదార్థాలను విక్రయించవద్దంటూ పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. ఫలితం లేకపోవడంతో ఆగ్రహించిన ఆదివాసీ మహిళలు కల్లుబట్టీలపై దాడులకు దిగుతున్నారు. గతంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో మహిళలు బెల్ట్‌షాపుల నిర్వహణపై తిరుగబడ్డారు. తాజాగా తలమడుగు మండలం కోసాయి, ఉమ్రి, తదితర గ్రామాల్లో కల్లు బట్టీలను నిర్వహించవద్దంటూ దాడికి దిగి వేల లీటర్ల కల్తీ కల్లును ధ్వంసం చేశారు. కల్తీ కల్లుతో తమ కుటుంబీకులు అనారోగ్య బారీన పడుతున్నారని ఆరోపించారు. ఏజెన్సీ గ్రామాలలో అనుమతులు లేకుండా కల్తీ కల్లును విక్రయిస్తే సహించేది లేదంటూ హెచ్చరిస్తున్నారు. కల్తీ కల్లుకు అలవాటు పడి పలువురు యువకులు వ్యవసాయ పనులు, ఉపాధికి దూరమవుతున్నారని చెబుతున్నారు. ఇంటిపెద్ద దిక్కే అనారోగ్య బారీన పడడంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. సంస్కృతీ, సంప్రదాయాలకు మారుపేరుగా నిలిచే ఆదివాసీ గిరిజన గూడాల్లో మత్తు పదార్థాలను విక్రయిస్తే దాడులు తప్పవని చెబుతున్నారు. అయితే అధికారులకు ఫిర్యాదు చేసినా.. 'మాములు' గానే తీసుకోవడంతో ఆదివాసీ మహిళలే దాడులకు దిగుతున్నారు.

తలమడుగు ఘటనపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం

: విజయేందర్, ఎక్సైజ్ సీఐ, ఆదిలాబాద్

తలమడుగు మండలంలో జరిగిన దాడి ఘటనపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఎవరైనా కల్తీ కల్లు అమ్మకాలను జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్న ఉద్దేశంతోనే కల్లుబట్టీపై మహిళలు దాడి చేసినట్లు తెలిసింది. కల్లుతో పాటు బెల్ట్‌షాపులు, దేశీదారును కొన్ని గ్రామాల్లో పూర్తిగా నిషేధించారు. కల్తీ కల్లు విక్రయాలు జరిపినట్లు రుజువైతే నిర్వాహకులపై కేసులు తప్పవు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

● 16న జిల్లాకు కేటీఆర్ : మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 12: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల ముందుంచి.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో జిల్లాకు ఏం చేశారని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రికి స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు సమస్యలు విన్నవించినా.. పట్టించుకోలేదన్నారు. ఈనెల 16న ఉదయం 10.30 గంటలకు గాయత్రి గార్డెన్‌లో నిర్వహించే బూత్‌స్థాయి సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నారని, బూత్‌స్థాయి కార్యకర్తలు పాల్గొనేలా మండల కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏవిధంగా వ్యవహరించాలో బూత్‌స్థాయి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లాకు రానున్నారని తెలిపారు. బూత్ స్థాయి కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైనథ్, ఆదిలాబాద్ ఎంపీపీలు గోవర్ధన్, గండ్రత్‌రమేష్, పార్టీ నాయకులు మనోహర్, రోకండ్ల రమేష్, నారాయణ, రాజు, జోగు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లుపై మహిళల యుద్ధం!

● తలమడుగు మండలంలో కల్తీ కల్లుపై ఆదివాసీ గిరిజన మహిళల ఆగ్రహం ● దేగామలో తెల్లకల్లు బట్టీ దుకాణంపై మూకుమ్మడి దాడి

తలమడుగు, ఏప్రిల్ 12: మద్యం మహమ్మారితో ఆదివాసీ గిరిజన కుటుంబాలు చిందరవందర అవుతున్నాయని, పలుమార్లు సంబంధ శాఖ అధికారులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని మండలంలోని దేగామ గ్రామంలో గల తెల్లకల్లు బట్టీపై ఆదివాసీ మహిళలు యుద్ధభేరి మోగించారు. పల్సి(బి), పల్సి(బి) తండా, కోసాయి, ఉమ్మరి, దేగామ గ్రామాలకు చెందిన మహిళలు సంఘటితమై ఐక్యతతో తెల్లకల్లు బట్టీపై గురువారం సాయంత్రం మూకుమ్మడి దాడి చేశారు. బట్టిలో నిల్వ ఉంచిన తెల్లకల్లు బాటిళ్లను, ప్యాకెట్ల ఉంచిన కల్లును బయటకు తెచ్చి రోడ్డుపై పారబోసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కల్తీ తెల్లకల్లుతో చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు బానిసలు అవుతున్నారన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు తక్కువ ధరకు దొరికే ఈ కల్తీ కల్లు తాగుతూ ఇతర పనులకు వెళ్లకుండా మద్యం మత్తులో తూగుతున్నారని పలువురు ఆదివాసీ గిరిజన వాపోయారు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఇలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా కల్తీ కల్లును విక్రయిస్తున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన గ్రామాల్లో మద్యం విక్రయాలు చేపడతే కఠిన చర్యలు తప్పవని గిరిజన మహిళలు హెచ్చరించారు. ఇందులో పెద్దసంఖ్యలో గిరిజన గ్రామాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే తుడుందెబ్బ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఝరి గ్రామంలోనూ తెల్లకల్లును రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు.



దేగామలో కల్తీకల్లును పారబోస్తున్న మహిళలు

ప్రభుత్వ పథకాలను చూసి కాంగ్రెస్‌లోకి వలసలు

● పార్టీ నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, ఏప్రిల్ 11: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు అధికార పార్టీలోకి చేరుతున్నారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలు ఇచ్చిన విధంగా పథకాలను అమలు చేయడం జరుగుతుందని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుని రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్నది కాంగ్రెస్ నాయకుల కోరిక అన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణల ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్ర సహకర బ్యాంకు డైరెక్టర్ సామ ప్రభాకర్‌రెడ్డి, నర్సాపూర్(బి) మాజీ సర్పంచ్ పెందూర్తి కళావతి, మారుతిలతో పాటు బీఆర్ఎస్ మహిళ నాయకులు కడమండ్ల రాజమణి, దొనకొండ సుగుణ, లింగంపల్లి శ్యామల, ఏదుల సునిత, కుంభాల గంగు, మోరపాక శాంత, కోలపురం సుశీల, పోలపురం నాగమణి, కోలాపురం పద్మ, పిప్పకుర్తి పద్మ, చిప్పగుర్తి లక్ష్మి, కుంభాల లక్ష్మి,ఇంటూరి సుకన్య, శనిగారపు జయమ్మ, కుంభాల పద్మ, కోలాపురం నాగమణిలు చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారికి ఎమ్మెల్యే బొజ్జుపటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణలు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిరుదుల లాజర్, లింగంపల్లి చంద్రయ్య, అజీముద్దీన్, ఖయ్యుం, ఇక్బాల్, కాలేరి రవీందర్, జాదవ్‌జగదీశ్, మెస్రం భాగ్యలక్ష్మి, రాదాబాయి, నిస్సార్, జైనూద్దీన్, సలీం, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు

భక్తిపారవశ్యంతో పులకించిన సాలెవాడ(బి)

● ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

ఉట్నూర్, ఏప్రిల్ 12: మండలంలోని సాలెవాడ(బి) గిరిజన గ్రామం భక్తి పారవశ్యంతో పులకించింది. హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో మహోత్సవాలు మూడు రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. బుధవారం మండలంలోని కుమ్మరితండా హనుమాన్ మందిరం నుంచి ఆదివాసీ భక్తులు సాలెవాడకు కళశాలలో సాగిన శోభాయాత్ర మనోహరంగా నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, పుణ్య చనము, జలది నివాసము, కార్యక్రమాలను నిర్వహించారు. మూడు రోజుల నుంచి సాలెవాడ గ్రామం ఆధ్యాత్మికతను చోటు చేసుకుంది. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముందే ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రముఖులు, మహారాజుల ఆధ్వర్యంలో కీర్తనలు, ఉపదేశాలు జరిగాయి. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా విష్ణు మహారాజ్ ప్రవచనాలు, జైవంత్‌రావు మహరాజ్ ప్రవచనాలు, వినాయకరావు మహారాజ్ ప్రవచనాలు సాగాయి. కలశ స్థాపన అనంతరం నుంచి ప్రతీరోజు ఆధ్యాత్మిక ప్రసంగాలను ప్రజలు అలంకించారు. శుక్రవారం రాంసింగ్ మహరాజ్, కోరంగ యశ్వంత్‌రావు మహరాజ్, సురేష్ మహరాజ్‌ల ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మరపా బీజారావు, మేస్రం నాగోరావు, మరప శేఖు, మరప నాగోరావ్, మేస్రం కోసేరావు, ఆడ రాము, పెందోర్ జగన్నాథరావు, మెస్రం చందు, మరప జల్పత్‌రావు, ఆత్రం సక్కు, పంద్ర జైవంత్‌రావు, పురక బాపురావు, మెస్రం దుర్గు, శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

సంక్షిప్త సమాచారం

నేడు పలుచోట్ల విద్యుత్ సరాఫరాలో అంతరాయం

ఇచ్చోడ, ఏప్రిల్ 12: ఇచ్చోడ సబ్‌స్టేషన్, నర్సాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుల్ సరాఫరాలో అంతరాయం ఏర్పడతుందని విద్యుత్తుశాఖ ఏఈ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా విద్యుత్తు తీగలు, విద్యుత్తు స్తంభాలు, తదితర మరమ్మతుల నిమిత్తం అంతరాయం ఏర్పడనుందని, విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉట్నూర్: మండలంలోని ఉట్నూర్, పులిమడుగు, దంతన్‌పల్లి సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కోసం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఉట్నూర్ ట్రాన్స్‌కో ఏఈ శ్రావణ్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, పరిధిలోని వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

'మహనీయుల జయంతి ఉత్సవాలను జయప్రదం చేద్దాం'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 12: ఈనెల 30 వరకు నిర్వహించే పీడిత వర్గాల విముక్తి ప్రదాతల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గణేష్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహనీయుల జయంతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల మహనీయులు జన్మించిన పవిత్ర మాసమని, ఇందులో పూలే, అంబేద్కర్, కాన్షీరామ్‌తో పాటు ఎంతో మంది మహనీయులు ఉన్నారని పేర్కొన్నారు. ఇందులో నాయకులు సీహెచ్ వెంకటేశ్, దర్శనాల అశోక్, బడుగు రాజేశ్వర్, పొన్కంటి శేఖర్, అన్నెలక్ష్మణ్, జగదీశ్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న దర్శనాల మల్లేష్

నేడు జిల్లా సదస్సు : సీపీఎం

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 12: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాదం, భారత రాజ్యాంగ రక్షణ కోసం వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 13న ఉదయం 11గంటలకు బీసీసంఘ భవనంలో జిల్లా సదస్సు నిర్వహించ తలపెట్టినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ తెలిపారు. శుక్రవారం వామపక్షార్టీల ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాద శక్తుల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరి పై ఉందన్నారు. ఈ సదస్సుకు సీపీఎం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ప్రభాకర్ హాజరవుతున్నారన్నారు. ఇందులో అరుణ్ కుమార్, జగన్‌సింగ్, వెంకట్‌నారాయణ, బండి దత్తాత్రి, గణేష్, అన్నమొల్ల కిరణ్, తదితరులున్నారు.